# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-11-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వం ఈరోజు పలు ప్రధాన బిల్లులను ప్రవేశపెట్టనుంది.**
2. **మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వి. అనిత పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**
4. **రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు**
5. **రాష్ట్రంలోని పాఠశాలల సమయాల్లో మార్పులు చేయనున్నట్లు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ తెలిపింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాలు ఆరో రోజు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. శాసన సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు పలు ప్రధాన బిల్లులను శాసన సభలో ప్రవేశపెట్టనుంది. పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మున్సిపల్ చట్టసవరణ బిల్లును మంత్రి నారాయణ, ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం, ఆయుర్వేదిక్, హోమియోపతి, వైద్య రిజిస్ట్రేషన్ చట్ట సవరణ బిల్లులను మంత్రి సత్య కుమార్ యాదవ్, భూసేకరణ చట్ట సవరణ బిల్లును మంత్రి అనగాని సత్యప్రసాద్, సహకార సొసైటీల చట్ట సవరణ బిల్లుని మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెడతారు. అనంతరం రాష్ట్రంలోని 8 డివిజనల్, 4 రైల్వే జోనల్ కమిటీలకు సంబంధించి రెండేళ్ల కాలానికి సభ్యులను ఎన్నుకునేలా శాసనసభలో తీర్మానం చేయనున్నారు. ఈ తీర్మానాన్ని రాష్ట్ర రహదారుల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన రెడ్డి ప్రవేశపెట్టనున్నారు.

-------------------------

మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వి. అనిత పేర్కొన్నారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ, స్త్రీలపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని

హెచ్చరించారు. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా కఠిన చట్టాలు, ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్ (17 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ–ఏపీయస్ఆర్టీసీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈరోజు శాసనసభ సమావేశాల్లో భాగంగా ఏపీయస్ఆర్టీసీపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే రాష్ట్రంలో పలు చోట్ల కొత్త బస్సులను ప్రవేశపెట్టిందని చెప్పారు. ఆర్టీసీలో నియామకాలకు సంబంధించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 34 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో భూ సమస్యలపై రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు పెట్టి అభ్యంతరాలను పరిష్కరిస్తామని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్. వెల్లడించారు. అసైన్డ్ భూముల కేటాయింపుపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ,

వాయిస్ (36 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఎమ్మిగనూరు పురపాలక సంఘం పరిధిలో తాగునీటి సమస్యపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ,

వాయిస్ ( 34 సెకన్లు)

---------------------------

అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మహిళా, శిశు సంక్షేమ, శాఖా మంత్రి జి. సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యాలయాల వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనలు చేసిన విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని అన్నారు. దశలవారీగా అంగన్వాడీలతో చర్చించి ప్రతి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్వాడీ సిబ్బందికి గ్రాట్యూటీ చెల్లింపు విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, లబ్ధిదారులకు అందించే సేవలకు ఇబ్బంది కలగకుండా విధులు నిర్వహించాలని మంత్రి కోరారు.

---------------------------

మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా మత్స్యకారుల సంక్షేమంపై సభ్యులు అడిగిన

ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ...

..వాయిస్.. 31 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని పాఠశాలల సమయాల్లో మార్పులు చేయనున్నట్లు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ తెలిపింది. విద్యా కేలండర్‌లో సాయంత్రం 4 నుంచి 5 గంటల సమయాన్ని తప్పనిసరి చేసింది. ఉన్నత పాఠశాలల పనివేళలు ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు కాగా, దీన్ని 5 గంటల వరకు పెంచింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలానికి రెండు పాఠశాలల్లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని ఆదేశాలిచ్చింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 25 నుంచి 30 వరకు ఈ విధానంలో పాఠశాలలు నడపనున్నారు. పాఠ్యాంశాలు బోధించడానికి మాత్రమే గంట సమయం పొడిగించామని, మిగతా సమయంలో మార్పులు ఉండవని అధికారులు పేర్కొన్నారు. వీటి ఫలితాలను బట్టి రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల ఈ విధానాన్ని అమలు చేయనున్నామని అధికారులు తెలిపారు.

---------------------------

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చేందుకు కృషి చేస్తానని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె పట్టాభిరామ్ అన్నారు. విజయవాడలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ గా ఈ రోజు ఆయన బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. అనంతరం పట్టాభిరామ్ మాట్లాడుతూ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు.

---------------------------

గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలోని శాఖా గ్రంథాలయాన్ని మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఇందులోని పుస్తకాలు వినియోగించుకోవడం మరింత మందికి స్ఫూర్తిని ఇస్తుందన్నారు. గ్రంథాలయంలోని ఒక అంతస్తును డిజిటల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రానున్న ఆరు నెలల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈ భవనంలో మౌలిక వసతులు కల్పించి, మరమ్మతులు చేయించనున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

కార్తిక సోమవారం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. భక్తులు వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. శ్రీశైలం, మహానంది, విజయవాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లోని ఆలయాల్లో రద్దీ నెలకొంది. కృష్ణా, గోదావరి నదుల్లో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. అనంతరం నదుల్లో దీపాలు వదిలారు.

======================